


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -166-

**(27 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మా బందరులో** ఒక పెద్దమనిషి వుండేవాడు. ఆయన సాయంత్రంపూట వచ్చి కాఫీ హోటల్ ముందు నిలబడేవాడు. లోపలికి వచ్చిపోయే వారిని –

"ఊర్లోకి ఏమైనా కళాఖండాలు వచ్చాయా? అలాటివి ఏమైనా వుంటే  చెప్పండి. మామూలువైతే వద్దు హాయిగా ఇంటికిపోయి 'రెనడే ' – 'బాలగంధర్వ' రికార్డులు పెట్టుకుంటాను" అనేవాడు.

కళాఖండాలంటే మంచి సినిమాలని ఆయన అభిప్రాయం. అప్పుడు ఊళ్ళో వున్నవి రెండే సినిమా హాలులు, వాటిలో ఏం చిత్రాలాడుతోంది., కాఫీ హోటల్ ముందు బోర్డులుండనే వుండేవి.

పోతే కళాభిజ్ఞత అందరికీ తెలియాలని అలా అడుగుతూ వుండేవారు. "కళాఖండాలు తెప్పించరు. వాటికి డబ్బురాదు. రసజ్ఞులు తప్ప ఎవరూ వెళ్ళరుగా మరి. మొన్న వచ్చిన ఒక న్యూ థియేటర్స్ పిక్చరుకు మొదటి క్లాసులో వున్నది ఇద్దరమే. రెండోవారెవరో తెలుసా మట్నూరి కృష్ణారావుగారు" అని ఆయనతో పోల్చుకుని కొంచెం సేపు మురుసుకుని, కొంచెం పొడుం పీల్చి ముక్కు దులుపుకునేవాడు పాపం.

నేను చదువుకునే రోజుల్లో కొన్నాళ్ళు ఒక సంగీత విద్వాంసుడి ఇంట్లో అద్దెకు వున్నాం. నేను సావిట్లో కుర్చుని ఇంగ్లీషు పద్యాలో, థీరమ్స్ బట్టీ పడుతూ వుండేవాణ్ణి. ఆయనగారు "అదుగో ద్వారక ఆలమందలవిగో" అంటూ పెద్దగా కేక పెడుతూ ఆయనగారికి వున్న తడిక తలుపు ఒక్కసారి బయటికి నెట్టి అభినయంతో వురికేవాడు సావిట్లోకి.
అయిదారు నిమిషాలు ఆ పద్యం రాగం వినిపించేవాడు.

“ఆ సమయంలో కృష్ణుడు ఏం చేస్తున్నాడురా నిద్రపోతున్నాడు. దొంగనిద్ర దుర్యోధనుడు తల దగ్గరిగా కూర్చున్నాడు. అర్జునుడు వెళ్ళి కాళ్ళ దగ్గిర కూర్చున్నాడు. ఆ కృష్ణ పరమాత్మ ఏం చేశాడురా.. చివాలున లేచాడు. అర్జునుణ్ణి చూశాడు. చూసి తర్వాత దుర్యోధనుణ్ణి చూశాడు. అదంతా నాటకం. అప్పుడు ..

బావా! ఎప్పుడువచ్చితీవు.. బావా... బావా..బావా ఎప్పుడు వచ్చితీవు" అంటూ ఆ పద్యమంతా అనేక రకాలుగా చదివి 'బావ' అనే మాటను బంతిలాగా ఎగరవేసి పట్టుకుంటూ అభినయించేవాడు. అప్పటికి ఆయన 'కళా పూనకం' కొంచెం తగ్గేది.

"ఇదిరా అసలు సంగీతం.. అసలు అభినయం.. సంగీతాభినయాలు అలా కలిసి మెలిసి వుంటాయిరా నువ్వేదో చదువుతున్నాననుకో. డిగ్రీ చదువు. దాన్ని అలా వుంచి కళకోసం కూడా పాటుపడు. మా యింట్లో అద్దెకు వుండటం నీ అదృష్టం. ఆదివారం నాడు పద్యాలు నీచేత కూడా చదివిస్తాన"నే వాడాయన.

ఆదివారం రాగానే ప్రయివేట్ క్లాసుందని పారిపోయేవాణ్ణి. వీలు చిక్కితే నాచేత ఆ చేతకాని పని చేయించేవాడే ఆయనగారు. ఆ సంవత్సరం తర్వాత ఇల్లు మారాం. సామాను సర్దుకుని వచ్చేస్తుంటే "పద్యాలు చదవడం నేర్చుకోకుండానే పోతున్నావు. ఎక్కడుంటేనేం రేపు ఆదివారం రా. నీ చేత ఆనంద భైరవి పాడిస్తాను" అన్నారు గుమ్మందాకా వచ్చి.

మా బంధువుల్లో ఒకాయన తన ఇల్లు కళాభూయిష్టంగా వుండాలని ఎంతో తాపత్రయపడేవాడు. ఎక్కువ ఆస్తిగలవాడు కాదు. అయినా ఆయన గారికి ఆ కళాభిమానం ఎలా పుట్టుకొచ్చిందో వచ్చింది. బస్తీలకు వెళ్ళేవాడు. ఎవరింటి ముందు ఎలాటి పూల చెట్టు వున్నాయో చూసేవాడు.

వాటిని ఎంత ఖరీదైనా సరే  కొని తెచ్చి యింటిముందు వేసేవాడు. కాని వాటిలో సగానికి సగం కూడా బ్రతికేవి కావు. అయితే మాత్రమేం? మళ్ళీ తెప్పించి వేయించేవాడు. ఎన్ని రూపాయలైనా సరే వెచ్చించి, ఎరువులు తెప్పించి వేసేవాడు. ఆయనగారో సంవత్సరం తంటాలుపడితే ఆరో, ఏడో చెట్లు బ్రతికాయి.

ఆయన పేరు పిచ్చయ్య. అందరూ వారి యిళ్ళకు వారి వారి పేరు పెట్టుకుంటున్నారని తనుకూడా ఒక రాతి ఫలకం మీద "పిచ్చి గార్డెను" అని వ్రాయించి తెచ్చుకుని గోడకు అతికించి, ఆరోజు గొప్ప విందు చేశాడు.

ఊళ్ళోవున్న ఒక ముసలాయన "ఇదంతా దేనికి? ఊళ్ళో వాళ్ళందరికి మీ యిల్లు బాగా తెలుసుగా?" అంటే

"తెలిస్తే తెలియవచ్చు. ఇదంతా కళ, కళను గురించి చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. కళను గురించి మాట్లాడే వాళ్ళను పిలిపించి త్వరలోనే ఒక సభ చేయిస్తాను. అప్పుడు విందురుగాని. కళలంటే మాటలనుకున్నావా లక్ష్మయ్య మామయ్యా" అన్నాడుట.

తర్వాత ఇంట్లో అలంకారం మొదలు పెట్టాడు. రంగు రంగుల తెరలు పసందైన పరుపులు ఎన్నో ఖరీదైన బొమ్మలు, సోఫాలు కాఫీ, టీ సెట్లు, నేలమీద తివాసీలు, మంచి గడియారం, ఫ్లవర్ వేజ్‌లు ఖరీదుగల సెంట్లు పెళ్ళానికో పాతిక రకాల చీరలు, పదిరకాల చెప్పులు తనకూ అన్ని రకాలు ఎన్నో తెచ్చాడు.

ఈ కళా పోషణకు సుమారు అయిదెకరాలు వూళ్ళో మరో పెద్దమనిషి పేరు క్రిందకు మారినాయని చెప్పుకున్నారు. అయితే మాత్రమేం పిచ్చయ్యగారి ఇల్లు అచ్చంగా కళానిలయమైపోయింది.

అన్నట్లు గోడలకు అనేక రకాల చిత్రపటాలు తెచ్చి తగిలించాడు. ఒక పెద్ద మనిషి వచ్చివాటిని చూస్తూ ఒక చిత్రం దగ్గర ఆగి" పిచ్చయ్యా ఇది పూర్వసాంప్రదాయానికి చెందిన చిత్రమా? ఆధునికమా?" అని ప్రశ్నించాడు.

పిచ్చయ్యగారు పిచ్చి చూపులు చూస్తూ "చూడండీ కళ అన్న తర్వాత కళే. దానికి ఒక కాలమంటూ ఏమిటి? కలకాలం వుండేదాన్నే కళ అన్నారు పెద్దలు. నాకు విభేదాలు లేవు" అని ఒక గంభీరోపన్యాసం ఇచ్చాడుట.

ఒక ఏడాది ఆ కళాభవనం అలా ప్రకాశించింది. లక్ష్మి వెనకడుగు వేసిందిట ఇంతలో. కళమాటేలావున్నా ఇంట్లో వాళ్ళందరికీ ఆకళ్ళు వెంట పడ్డాయట. ఇంట్లో వున్న వస్తువులు ఒక్కొక్కటే అమ్మకం పెట్టడం ప్రారంభించారుట. అది చూసిన ఒక పెద్ద మనిషి "పిచ్చయ్య గొప్ప కళారాధకుడు. కళను పోషించడం, ఆరాధించడంతో సంతృప్తి పడి వూరుకోలేదు. కళను ఈ కొంపనుంచి ఎక్స్‌పోర్టు" కూడా చేస్తున్నాడు అన్నారుట.

కళాభిమానం 'గంగవెర్రులు' అని మరో ఆయన చప్పరించి చక్కాపోయాడుట.

Post your comments